Follow: @ANNTELUGU
ANN తెలుగు
REGISTERED NUMBER APTEL/2014/58382
23-01-2026
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 28 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శుక్రవారం WWW.EPAPER.MAHAADAILY.COM



సీఎం రేవంత్‌తో

## లోకేష్ భేటీ

**దావోస్ లో మర్యాదపూర్వక కలయిక**

అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు తగ్గేదెలే
స్కిల్ క్యాంపస్ కు రావాలని లోకేష్ కు ఆహ్వానం

**హైదరాబాద్, బిభా:** స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా తెలుగు రాష్ట్రాల నేతల మధ్య స్నేహపూర్వక భేటీ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల అభివృద్ధి, ప్రగతి ప్రణాళికలపై ఇరువురు నేతలు ఫలవంతమైన చర్చలు జరిపారు. పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల సమగ్రాభివృద్ధి సాధ్యమని ఇద్దరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భాగంగా మంత్రి నారా లోకేశ్... సీఎం రేవంత్ రెడ్డిని మంగళగిరి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను

మిగతా 2లో


టాప్ న్యూస్

ప్రతిపక్ష హోదా ఇస్తేనే
### అసెంబ్లీకి వస్తా
- తేల్చేసిన జగన్
- స్పీకర్ వ్యాఖ్యలకు కౌంటర్



02

విజయ్ పార్టీకి
### విజిల్ గుర్తు
- కేటాయించిన ఎన్నికల సంఘం



02

తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచే
### గొల్ల రామవ్వ
- ఈనెల 25 నుంచి ఈటీవీ విన్ లో



02




# ఉద్యోగాలు మటాష్

## ప్రతి ముగ్గురిలో ఒక్కరికే జాబ్

80 కోట్లమందికి నో జాబ్స్.. రాబోయే పదేళ్ళు పెనుసవాల్

**మహా:** ఉద్యోగాల సంక్షోభం ప్రపంచానికి పెనుసవాల్ గా మారనుంది. వచ్చే పదేళ్ళలో ప్రపంచంలో వచ్చే మార్పులు ఉద్యోగాల వేటుకు కారణమవుతాయని, ఉద్యోగాలకు.. మావనవనరులకు పూడ్చలేనంత అంతరం ఏర్పడుతుందన్న ఆందోళనను ప్రపంచబ్యాంకు వ్యక్తం చేస్తోంది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ప్రెసిడెంట్ అజయ్ బంగా రాబోయే పదేళ్ళలో రానున్న ఉద్యోగాల సంక్షోభంపై ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో దాదాపు 120 కోట్ల మంది యువత ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశించడానికి సిద్ధంగా ఉంటే.. వారికి అందుబాటులో ఉన్న అవకాశాలు కేవలం 40 కోట్లు మాత్రమేనని దీంతో 80 కోట్ల మందికి నిరుద్యోగ గండం స్పష్టంగా కనబడుతున్నదని అజయ్ బంగా గణాంకాలతో వివరించారు.

వివరాలు 2లో

### ట్రంప్ ప్రభావం..

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య ఒత్తిడి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. టారిఫ్ యుద్ధాలు, ట్రేడ్ వార్స్, డాలర్ ఒత్తిడి, చైనా–అమెరికా విభేదాలు, రష్యా- ఉక్రెయిన్ వార్ వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దీని ప్రభావం ఉద్యోగ మార్కెట్‌పై కూడా తీవ్రంగా పడనుంది.



స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా
### భారత్..
- ఇదే ప్రధాని విజన్
- క్రికెట్ ఆడి సంసద్ ఖేల్ మహోత్సవ్ ను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- క్రీడా రంగంలో భారత్ ప్రపంచస్థాయిలో రాణించాలి : కిషన్ రెడ్డి

వివరాలు 2లో




ఒక్కరోజులోనే
రూ.18 వేలు తగ్గిన
### వెండి ధర

**మహా:** బంగారం, వెండి కొనుగోలుదారులకు తాజాగా ఊరట లభించింది. ముఖ్యంగా వెండి ధర ఒక్కరోజులోనే భారీగా పడిపోవడం గమనార్హం. గురువారం నాడు కిలో వెండి ధర ఏకంగా రూ.18 వేల వరకు తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3,12,000కు చేరింది.

మిగతా 2లో

### జార్ఖండ్ లో ఎన్ కౌంటర్

వివరాలు 2లో




# నైనీ బ్లాక్ మంటలు

## రంగంలోకి కేంద్రం.. చిక్కుల్లో సింగరేణి

- నైనీ బ్లాక్ టెండర్ రద్దు చేసినట్లు సింగరేణి ప్రకటన
- బొగ్గు కుంభకోణం ఆరోపణలపై నేడు డిప్యూటీ సీఎం భట్టి సంచలన ప్రెస్ మీట్
- సీబీఐని రాష్ట్రంలో నిషేదించిందే బీఆర్ఎస్- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజం
- రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణిది కీలక పాత్ర

**హైదరాబాద్, మహా:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కోల్ మైన్స్ టెండర్ల వ్యవహారం పొలిటికల్ సెగలు పుట్టిస్తోంది. ఒడిస్సాలోని నైనీ బ్లాక్ బొగ్గు టెండర్ల వేదికగా రాజకీయం భగ్గుమంటోంది. నైనీ బొగ్గు గని తవ్వకాల టెండర్ల లో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు రాగా, ఇంధన శాఖ మంత్రిగా మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం నైనీ కోల్ మైన్స్ టెండర్లు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు బిడ్లు ప్రారంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో సింగరేణి వెనక్కి తీసుకుంది. దీంతో కేంద్రం ఎంటరైంది. చెప్పాపెట్టకుండా టెండర్లు ఎందుకు రద్దుచేశారంటూ కేంద్రం ఫైర్ కావడంతో పాటు ఇందుకు దారితీసిన పరిస్థితుల అధ్యయనానికి ఇద్దరు కీలక అధికారులతో ఒక కమిటీని వేసింది.

వివరాలు 2లో

### నేడు డిప్యూటీ సీఎం భట్టి సంచలన ప్రెస్ మీట్

సింగరేణి ప్రజల ఆస్తి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి ఆస్తులు దోపిడీకి గురి కాకుండా కాపాడే బాధ్యత తమదే అని అన్నారు. సింగరేణిపై విపక్షాలు తప్పడు ప్రచారం చేస్తున్నాయి. ఈ అంశంపై శుక్రవారం పూర్తి వివరాలతో మాట్లాడుతా అని అన్నారు.

# కేటీఆర్‌కు నోటీసులు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

- నేడు విచారణకు రావాలని ఆదేశం
- తర్వాత కవిత, సంతోష్ లను పిలిచే ఛాన్స్
- కేసీఆర్ రాత చిట్టీ చుట్టూ విచారణ



**హైదరాబాద్, మహా :** సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను వేగవంతం చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం, తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు తమ ఎదుట హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. నంది నగర్ లోని కేటీఆర్ నివాసంలో ఈ నోటీసులు అందించారు. జూబ్లిహిల్స్ ఏసీపీ ఆఫీసులో కేటీఆర్ ను ప్రశ్నించనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, జడ్జీల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలపై ఈ దర్యాప్తు సాగుతోంది. జనవరి 20న జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విచారణలో హరీష్ రావు సుమారు 78 గంటల పాటు సిట్ అధికారుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా సిట్ అధికారులు అడిగిన ప్రశ్నల్లో పస లేదని, తనను

మిగతా 2లో




# ఆనాడు ఆశీర్వదించారు

## ప్రభుత్వం ఏర్పాటై ప్రజాపాలన కొనసాగుతోంది

కృతజ్ఞతలు చెప్పడానికే వచ్చా.. గిరిజనుల అభివృద్ధికి ఇందిరా సౌర గిరిజన వికాసం
విద్యుత్ సమస్యల పరిష్కారానికి పొలం బాట, ప్రజల బాట
పేదలందరికి ఇందిరమ్మ ఇల్లు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

02



## విజయ్ పార్టీకి విజిల్ గుర్తు

### కేటాయించిన ఎన్నికలసంఘం

**మహా:** తొలిసారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్న విజయ్ పార్టీ టీవీకేకు శుభవార్త లభించింది. ఆ పార్టీకి విజిల్ గుర్తు కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తమ అభ్యర్థులందరికీ ఒకే గుర్తు ఉండాలని పార్టీ చేసిన అభ్యర్థనను ఈసీఐ ఆమోదించింది. అవినీతి, అక్రమ పాలనపై గళం విప్పేందుకు, ప్రజలను చైతన్యపరిచేందుకు విజిల్ గుర్తు తమ విధానాలకు ప్రతీకగా నిలుస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్ రాజకీయ ప్రవేశంతో ఇప్పటికే యువతలో ఉన్న ఆసక్తిని ఓట్లుగా మలుచుకోవడంలో ఈ గుర్తు కీలకం కానుంది. మరోవైపు కమల్ హాసన్ పార్టీ ఎంఎన్ఎంకు 'బ్యాటరీ టార్చ్' గుర్తును కొనసాగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. 2021 ఎన్నికల్లో కూడా ఇదే గుర్తుతో పోటీ చేసినందున, ఓటర్లకు సులభంగా గుర్తుండేందుకు, పార్టీ గుర్తింపును కొనసాగించేందుకు తమకు పాత గుర్తునే కేటాయించాలని ఎంఎన్ఎం కోరింది. గత ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకపోయినా, టార్చ్ లైట్ గుర్తుతో తమ మద్దతును పటిష్ఠం చేసుకోవాలని కమల్ పార్టీ భావిస్తోంది.

## ఒక్కరోజులోనే రూ.18 వేలు తగ్గిన వెండి ధర

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల రోజుల్లో ఎప్పుడూ లేని విధంగా ఇంత పెద్ద స్థాయిలో వెండి ధర తగ్గింది. చైనా, యూరప్ వంటి ప్రధాన దేశాల్లో పరిశ్రమల డిమాండ్ తగ్గడం కూడా వెండి ధరపై ప్రభావం చూపిందని తెలుస్తోంది. వెండి ఎక్కువగా పరిశ్రమల్లో వినియోగం కావడం వల్ల గ్లోబల్ మాంద్య భయాలు పెరిగినప్పుడు దీని ధరలు త్వరగా పడిపోతుంటాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి కొనసాగుతుండటంతో పెట్టుబడిదారులు వెండి నుంచి కొంత వెనక్కి తగ్గినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.




## ఉద్యోగాలు మటాష్

(మొదటిపేజీ తరువాయి)

రాబోయే దశాబ్ద కాలంలో ప్రతి ముగ్గురు యువకుల్లో ఒక్కరికి మాత్రమే ఉద్యోగం దొరికే అవకాశం ఉందని అజయ్ బంగా పేర్కొన్నారు. 120 కోట్ల మందిలో మిగిలిన 80 కోట్ల మంది యువత పరిస్థితి ఏమిటనేది ఇప్పుడు ప్రపంచం ముందున్న అతి పెద్ద ప్రశ్న. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలు మార్పులు తీసుకువచ్చినా.. ఈ భారీ అంతరాన్ని పూడ్చడం అంత సులభం కాదు. ప్రభుత్వాలు కేవలం ఉద్యోగాలను సృష్టించే వాతావరణాన్ని మాత్రమే కల్పించగలవు. అసలైన ఉపాధి ప్రైవేట్ రంగం నుండే వస్తుంది అని బంగా వివరించారు. ఈ సందర్భంగా సింగపూర్ తరహాలో వ్యాపార అనుకూల విధానాలు, బలమైన మౌలిక సదుపాయాలు ఉంటేనే ప్రైవేట్ రంగం పెట్టుబడులు పెడుతుందని బంగా వివరించారు.

**ఎంఎస్ ఎంఈ రంగమే అసలైన పరిష్కారం**

భారీ కార్పొరేట్ కంపెనీల కంటే ఎంఎస్ఎంఈలు ద్వారానే ఎక్కువ ఉద్యోగాల సృష్టి సాధ్యమవుతుందని అజయ్ బంగా పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో, ఎక్కువ మందికి ఉపాధి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమాన అవకాశాలు, అందించే సామర్థ్యం ఎంఎస్ఎంఈ రంగానికే ఉందని తెలిపారు. ఎంఎస్ ఎంఈలకు సులభంగా రుణాలు, సాంకేతిక సహాయం, మార్కెట్ యాక్సెస్ కల్పించడమే ప్రభుత్వాల ముందున్న ప్రధాన కర్తవ్యమని సూచించారు.

**భారత్‌కు సవాల్**

భారత్ వంటి దేశాల్లో వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం వల్ల యువత పెద్ద ఎత్తున గ్రామాల నుంచి నగరాలకు వలస వెళ్తోంది. కానీ నగరాల్లో అందరికీ ఉద్యోగాలు దొరకడం లేదు. దీంతో స్లమ్స్ పెరుగుదల, పట్టణ పేదరికం, సామాజిక ఒత్తిడి, నిరుద్యోగ నిరాశ వంటి సమస్యలు తీవ్రరూపం దాలుస్తున్నాయని అజయ్ బంగా హెచ్చరించారు. గ్రామీణ పారిశ్రామికీకరణ, ఫుడ్ ప్రాసెసింగ్, లోకల్ మాన్యుఫాక్చరింగ్, స్టార్టప్ సంస్కృతి పెంపుదల ద్వారానే ఈ సమస్యకు కొంతవరకు పరిష్కారం సాధ్యమవుతుందని చెప్పారు. ఇతర దేశాల నుంచి వచ్చే అవుట్‌సోర్సింగ్ పనులపై మాత్రమే ఆధారపడటం భారత్ వంటి దేశాలకు ప్రమాదకరమని బంగా అభిప్రాయపడ్డారు. స్వదేశీ తయారీ, లోకల్ స్టార్టప్స్, స్వయం సమృద్ధి, ఎగుమతి ఆధారిత పరిశ్రమలు, పెంపుదల ద్వారానే దీర్ఘకాలిక ఉద్యోగ భద్రత సాధ్యమని స్పష్టం చేశారు.




(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో ఈ టెండర్ల విషయంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. టెండర్ నిబంధనలను రూపొందించేటప్పుడు సింగరేణి పాలకమండలిలో ఎందుకు చర్చించలేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. చర్చ జరిగి ఉంటే అవినీతి ఆరోపణలు వచ్చేవి కావు కదా అని ఆయన నిలదీశారు. అంతే కాకుండా, టెండర్లు వేయాలనుకున్న కంపెనీలకు క్షేత్రస్థాయి సందర్శన ధృవీకరణ పత్రాలు ఇవ్వకపోవడంపై కూడా కేంద్రం సీరియస్ అయ్యింది. అసలు ఆ నిబంధన ఎందుకు పెట్టారని ప్రశ్నించింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు చెందిన నైనీ బ్లాక్ టెండర్ల విషయంలో వివాదాలు తలెత్తడం ఇది రెండోసారి. గతంలో 2016 లో కూడా ఇలాంటి ఆరోపణల వల్లే టెండర్లు రద్దయ్యాయి. ఈ రద్దుతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్ట్ భవితవ్యం మళ్ళీ సందిగ్ధంలో పడింది.

**రంగంలోకి కేంద్రం.. విచారణకు కమిటీ**

నైని బొగ్గు గనుల రద్దుపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు నైని బొగ్గు గనుల రద్దుపై విచారణకు కమిటీ వేసింది. కమిటీలో కోల్ డిప్యూటీ డైరెక్టర్ చేత్న శుక్లా, కోల్ డైరెక్టర్ మర్పల్లి వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ ఇద్దరు కేంద్ర సభ్యుల బృందం సింగరేణిని సందర్శిస్తారు. నైని కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై టీమ్ విచారణ జరపనుంది. సింగరేణి నైని కోల్ బ్లాక్ మైన్ డెవలపర్, ఆపరేటర్ నియామకానికి సంబంధించి 28.11.2025న వెలుబడిన టెండర్ ఆహ్వాన నోటీసును విశ్లేషించనుంది. అదే విధంగా తవ్వకాలకు సంబంధించిన ఎండీఓలు మరియు ఔట్ సోర్సింగ్ పనుల కోసం నోటీస్ ఇన్వైటింగ్ టెండర్ తయారీలో ఇతర బొగ్గు కంపెనీలు అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయనుంది. ఈ కమిటీ మూడు రోజుల్లో తన నివేదికను సమర్పించాల్సి ఉంది.

**సింగరేణికి సహకరిస్తాం : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

సింగరేణి విషయంలో సహకరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బొగ్గు కుంభకోణం ఇష్యూలో బీఆర్ఎస్ నేతలు పదే పదే సీబీఐ చేత ఎంక్వయిరీ చేయించాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలోకి సీబీఐ రాకుండా నిషేధించిందే బీఆర్ఎస్ అని గుర్తుచేశారు. సింగరేణి విషయంలో కేంద్రానికి ఎలాంటి అజమాయిషీ లేదని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణిది కీలక పాత్ర అని చెప్పారు. సింగరేణిపై ప్రభుత్వాలు అదనపు భారాన్ని మోపుతున్నాయని అన్నారు. కొత్త నిబంధన పెట్టడం ముమ్మాటికీ తప్పేనని చెప్పారు. ఒక వేళ పెట్టినా సెల్ఫ్ డిక్లరేషన్ సరిపోతుందని అభిప్రాయపడ్డారు.

## జార్ఖండ్ లో ఎన్ కౌంటర్

### 15 మంది నక్సల్స్ మృతి

#### కీలక నేతలు మరణించినట్టు ప్రచారం

**మహా :** జార్ఖండ్లోని వెస్ట్ సింగ్ బహ మ్ జిల్లా సారాండా అడవుల్లో గురువారం ఉదయం భద్రతా బలగాలు, 209 మంది సభ్యుల కోబ్రా బెటాలియన్ కు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో సుమారు 15 మంది మావోయిస్టులు మరణించినట్టు తెలుస్తోంది. మావోయిస్టులున్నట్టు విశ్వసనీయ సమాచారం మేరకు భద్రతాబలగాలు కూంబింగ్ చేపట్టా యి. అదే సమయంలో ఇరు పక్షాల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతం. కొండలు ఉండటంతో ఇంకా కాల్పులు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకునేందుకు భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ఎన్ కౌంటర్ లో కీలకనేతలు మరణించినట్లు భద్రతాబలగాలు భావిస్తున్నాయి.



## ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తా...

### తేల్చేసిన జగన్
### స్పీకర్ వ్యాఖ్యలకు కౌంటర్

**మహా:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గురువారం కీలక ప్రకటన చేశారు. తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పిస్తే తప్ప అసెంబ్లీలో అడుగుపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. అధికార కూటమి ప్రభుత్వ అక్రమాలను, తప్పుడు పనులను సభలో ఎండగట్టాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, అప్పుడే తనకు తగినంత సమయం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఏకైక ప్రతిపక్షంగా ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడానికి స్పీకర్‌కు ఉన్న అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. "అసెంబ్లీలో ఉన్నది ఒక్కటే ప్రతిపక్షం, అది వైసీపీ మాత్రమే. మిగతా పార్టీలన్నీ ప్రభుత్వంలో భాగస్వాములే. మరి మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా స్పీకర్ ఎందుకు అడ్డుకుంటున్నారు? ఇది ప్రజాస్వామ్యమా అని మీరు స్పీకర్‌ను ప్రశ్నించాలి" అని జగన్ అన్నారు. అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు "పని చేయకపోతే జీతం లేదు" విధానం అమలు చేయాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు లక్నోలో జరిగిన సదస్సులో సూచించిన నేపథ్యంలో జగన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వైసీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు 2024 నుంచి అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే.


## ఆనాడు ఆశీర్వదించారు

### ప్రభుత్వం ఏర్పాటై ప్రజాపాలన కొనసాగుతోంది

కృతజ్ఞతలు చెప్పడానికే వచ్చా.. గిరిజనుల అభివృద్ధికి ఇందిరా సౌర గిరిజన వికాసం
విద్యుత్ సమస్యల పరిష్కారానికి పొలం బాట, ప్రజల బాట
పివిటిజిలందరికి ఇందిరమ్మ ఇల్లు,. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**జైనూర్ మహా :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రావాలని అది వచ్చేవరకు విశ్రమించమని పీపుల్స్ మార్చ్ లో తనతో పాటు అనేకమంది నడిచారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది, అధికారంలోకి రాగానే మళ్లీ రావాలని మీరంతా దీవించి పంపారన్నార. మీరంతా కోరుకున్నట్టే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, మీ సమస్యలు తీరుస్తుందన్నారు. మీకు కృతజ్ఞతలు తెలపడానికి తాను వచ్చానని ఆయన తెలిపారు. గురువారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం జాంగాం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఆనాడు ఏరికోరి తెచ్చుకున్న రాష్ట్రంలో స్వేచ్ఛ పోయిందన్నారు. ఈ ప్రాంత సంపద ఇక్కడి ప్రజలకు చెందాలని ఆనాడు మీరు కోరారని, మీరు కోరిన విధంగానే ప్రజా ప్రభుత్వంలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చామన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలకు లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పీపుల్ స్మార్ట్స్ పాదయాత్ర లో భాగంగా ఆనాడు ప్రతిరోజు నన్ను కలిసిన వారిని, వారు విజ్ఞప్తి చేసిన సమస్యలను వివరంగా రాసుకున్నానని తెలిపారు. బడ్జెట్లో ఆయా అంశాల పరిష్కారానికి నిధులు కేటాయిస్తున్నానని తెలిపారు. 2023 మార్చిలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర చేస్తున్న సమయంలో గిరిజనులు అటవీ భూముల హక్కులు, సాగు సమస్యలను వివరించారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక గిరిజనుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వారికోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇందిరా సౌర గిరిజల వికాసం అనే పథకాన్ని తీసుకువచ్చామని డిప్యూటీ సీఎం తెలిపారు. 2023 మార్చిలో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి పాదయాత్ర ప్రారంభించి ఖమ్మంలో ముగించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సమయంలో ఆయనకు ప్రజలు చేసిన విజ్ఞప్తులు, సమస్యలను ప్రజా ప్రభుత్వం వచ్చాక పెద్ద సంఖ్యలో పరిష్కరించారు. ఈ నేపథ్యంలో నాడు పాదయాత్ర సమయంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు వాటి పరిష్కారం ఇంకా మిగిలిపోయిన సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. అటవీ హక్కుల చట్టం కింద గిరిజనులు సాగు చేసుకునేందుకు వారికి పట్టాలు ఇచ్చాం, ఆ భూములు సాగు చేసుకునేందుకు విద్యుత్ సరఫరా విషయంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఇందిరా సౌర గిరి జలవికాసం పథకాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ పథకంలో ప్రభుత్వమే బోరు వేయించి సోలార్ పవర్ ద్వారా విద్యుత్ సదుపాయం, డ్రిప్పు, ఆర్థికంగా లాభపడేందుకు పామ్ ఆయిల్, అవకాడో వంటి మొక్కలు పూర్తిగా ఉచితంగా ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు. ఇప్పటికే ఈ పథకాన్ని నల్లమల్ల అటవీ ప్రాంతంలో ప్రారంభించామని తెలిపారు. భూసమస్యల పరిష్కారానికి మా ప్రభుత్వం రాగానే ధరణి చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పాము చెప్పినట్టుగానే ధరణి స్థానంలో భూభారతి కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు.

తన పాదయాత్ర సందర్భంగా విద్యుత్ సమస్యలను గిరిజనులు వివరించిన విషయం తనకు గుర్తుందని అదృష్టవశాత్తు ప్రియతమ నేత రాహుల్ గాంధీ



ఏఐసిసి అధ్యక్షుడు ఖర్గే తనకు ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు విద్యుత్ శాఖ సైతం అప్పగించారని తెలిపారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు వారానికి రెండు రోజులు పొలం బాట, ప్రజల బాట పడుతున్నారని అధికారులే మీ వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే అనారోగ్య సమస్యలు ఎదురైతే ఫోన్ చేయగానే 108 ఎలా వస్తుందో కరెంటు సమస్య ఉన్నవారు 1912 నెంబర్ కు కాల్ చేస్తే విద్యుత్ అధికారులే మీ వద్దకు వచ్చి 24 గంటల్లో ఒక వాహనంలో వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. పివిటిజి గిరిజన అందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు ఎంత తొందరగా కట్టుకుంటే అంత ఉపయోగం మీరు ఎంత వేగంగా కట్టుకుంటే అంత వేగంగా ప్రభుత్వం విలువ తెలుస్తుంది అని తెలిపారు. ఐదు సంవత్సరాల వ్యవధిలో మహిళా సంఘాలకు లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందించి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం అన్నారు. మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాదు మహిళల చేత బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి లీజుకు ఇప్పిస్తున్నామని వివరించారు.

పాదయాత్ర సమయంలో విద్యా వ్యవస్థ బాగాలేదని విన్నవించారన్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ సభ్యులు ఆలోచించి పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. మన బిడ్డలు ప్రపంచంతో పోటీపడేలా ఒక్కో పాఠశాలను 25 ఎకరాల్లో 200 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని రాష్ట్రంలో ఒకేసారి వంద పాఠశాలల నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్టు తెలిపారు. ఉట్నూరు ఆసిఫాబాద్ రహదారి వెడల్పుకు పాదయాత్ర సమయంలో విజ్ఞప్తి చేశారు మీ అందరి కోరిక మేరకు ఆ పనిని మంజూరు చేసి హమ్ పథకంలో రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలవబోతున్నట్లు తెలిపారు. ఉట్నూరు కరిమెరి రోడ్డు వెడల్పు, అనార్పల్లి వంతెన నిర్మాణం కోసం అడిగారు వాటిని మంజూరు చేసినట్టు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఓజా తెగ తయారు చేసే హస్తకళల వస్తువులను ఉమ్మడి రాష్ట్రంలో ఐటీడీఏ ద్వారా మార్కెటింగ్ చేసేవారు గత పది సంవత్సరాలు పట్టించుకోలేదని విజ్ఞప్తి చేశారు. మీ విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం రాగానే మీ వృత్తిని సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ కింద ప్రభుత్వం గుర్తించిందని, చేతి పనిముట్లకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ట్రై కార్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్, జిసిసి చైర్మన్ కోట్నాక తిరుపతి, ఎంపీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్పీ నితిక పంత్, డీఎఫ్ఓ నీరజ్ కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఏ ఎస్ పి చిత్తరంజన్, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు, నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీరా శ్యాం నాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు పాల్గొన్నారు.



### తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచే

## గొల్ల రామవ్వ

### ఈనెల 25 నుంచి ఈటీవీ విన్ లో

**మహా, ఫిల్మ్ డెస్క్:** తాళ్ళూరి రామేశ్వరి టైటిల్ పాత్ర పోషించిన "గొల్ల రామవ్వ" తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని... ఈ చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో పాల్గొన్న ముఖ్య అతిథులు పేర్కొన్నారు. స్వర్గీయ భారత ప్రధాని పి.వి.నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాటగాథకు దృశ్యరూపంగా ముళ్లపూడి వరా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రోమాంఛిత వీరగాథను... సుచేత డ్రీమ్ వర్క్స్ ప్రొడక్షన్ వర్మ డ్రీమ్ క్రియేషన్స్ పతాకాలపై... రామ్ విశ్వాస్ హనూర్కర్ రాఘవేంద్రవర్మ (బుజ్జి) సంయుక్తంగా నిర్మించారు. యువ ప్రతిభాశాలి అజహర్ షేక్ ఈ చిత్రానికి కార్యనిర్వాహక నిర్మాతగా కీలక బాధ్యతలు నిర్వహించడంతోపాటు... సాహిత్యం సమకూర్చడం విశేషం. ఇంతకుముందు ఈటీవీ విన్ కోసం "మౌనమే నీ భాష" చిత్రాన్ని నిర్మించి, వీక్షకుల నుంచి విశేష ఆదరణ పొందిన టీమ్ నుంచి వస్తున్న "గొల్ల రామవ్వ" ఈనెల 25 నుంచి ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కానుంది. తాళ్ళూరి రామేశ్వరి టైటిల్ పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకలో పి.వి. నరసింహారావు తనయులు పి.వి.ప్రభాకరరావు, తనయ బారాస ఎమ్.ఎల్.సి. సురభి వాణీదేవి, ప్రముఖ గీత రచయితలు కాసర్ల శ్యామ్, మౌనశ్రీ మల్లిక్, ప్రముఖ నటులు రాజీవ్ కనకాల, "రజాకార్" దర్శకులు యాటా సత్యనారాయణ, సీనియర్ దర్శకులు ఉదయభాస్కర్ పాల్గొని... చిత్ర దర్శకుడు ముళ్ళపూడి వరా, నిర్మాతలు రామ్ విశ్వాస్ హనూర్కార్, రాఘవేంద్రవర్మలను అభినందించారు. మా నాన్నగారు రాసిన గొప్ప కథల్లో ఒకటైన "గొల్ల రామవ్వ"ను ఎంతో గొప్పగా తెరకెక్కించారని వాణీదేవి ప్రశంసించారు. చిత్రబృందం పెద్ద సంఖ్యలో ఈ వేడుకలో పాలుపంచుకుని... ఈ సినిమాకి పనిచేసే అదృష్టం లభించడం పట్ల గర్వం వ్యక్తం చేశారు. ఈనెల 25 నుంచి ఈటీవీ విన్ లో ప్రసారం కానున్న ఈ చిత్రం తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం దక్కించుకుంటుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి... పి.ఆర్.ఓ: ధీరజ్ అప్పాజీ, నటీనటులు : అల్లు గీత, అన్విత్, మణి మంతెన, గానం : వరం, సంగీతం: సాయి మధుకర్, ఛాయాగ్రహణం: గంగమోని శేఖర్, కూర్పు: రాఘవేంద్రవర్మ, రచన: బయ్యవరపు రవి, కార్యనిర్వాహక నిర్మాత సాహిత్యం: అజహర్ షేక్, నిర్మాతలు: రామ్ విశ్వాస్ హనూర్కర్ రాఘవేంద్రవర్మ (బుజ్జి), చిత్రను వాదం దర్శకత్వం: ముళ్ళపూడి వరా

## కేటీఆర్‌కు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

కావాలనే ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని హరీష్ రావు విమర్శించారు. అయితే, సాంకేతిక ఆధారాలు మరియు అరెస్టయిన పోలీసు అధికారుల వాంగ్మూలాల ఆధారంగా విచారణ ప్రక్రియను మరింత లోతుగా నిర్వహించాలని సిట్ నిర్ణయించింది.

**సజ్జనార్ నేతృత్వంలోని సిట్ సమగ్ర విచారణ**

ప్రస్తుతం ఈ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు, డీఎస్పీ ప్రణీత్ రావు వంటి వారు ప్రధాన నిందితులుగా ఉన్నారు. వీరి విచారణలో వెలుగు చూసిన విషయాల ఆధారంగానే రాజకీయ నేతలకు నోటీసులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే రోజుల్లో ఈ విచారణ ఎటు దారితీస్తుందో, ఎవరికి కొత్తగా నోటీసులు అందుతాయో అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరమైన అంశంగా మారింది. కేసును సజ్జనార్ నేతృత్వంలోని సిట్ తీసుకున్నప్పటి నుండి మరింత దూకుడుగా విచారణ జరుపుతున్నారు. పెన్నుతో రాసిన పేర్ల చిట్టీ ఆధారంగా ట్యాపింగ్ లు చేయగా, ఆ చిట్టీలు ఎవరిచ్చారన్న కోణంలో ఇపుడు విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ట్యాపింగ్ పై కవిత సంచలన ఆరోపణలు చేయగా, త్వరలో కవితను, జోగినపల్లి సంతోష్ లను కూడా సిట్ పిలిచే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

**లొట్టపీసు కేసుగా లైట్ తీసుకుంటున్న కేటీఆర్**

కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ కేసును ఒక లొట్టపీసు కేసుగా కొట్టిపారేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే పాత కేసులను మళ్లీ మళ్లీ తోడుతున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా నైనీ కోల్ బ్లాక్ వంటి భారీ కుంభకోణాలను బీఆర్ఎస్ ఎండగడుతున్న తరుణంలో, తమను డిఫెన్స్‌లో పడేయడానికే ప్రభుత్వం ఈ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని గంటలు విచారించినా చివరకు ఇందులో తేలేది ఏమీ ఉండదని, ఇది కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యే తప్ప ఇందులో వాస్తవం లేదని కేటీఆర్ బలంగా వాదిస్తున్నారు. పోలీసుల నోటీసులకు స్పందించి ఆయన విచారణకు హాజరయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.



### స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా భారత్..

# ఇదే ప్రధాని విజన్

క్రికెట్ ఆడి సంసద్ ఖేల్ మహోత్సవ్ ను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

క్రీడా రంగంలో భారత్ ప్రపంచస్థాయిలో రాణించాలి : కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** ఆటలు కేవలం మెడల్స్ కోసమే కాదని, దేశ ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచానికి చూపేందుకు స్పోర్ట్స్ ఒక శక్తిమంతమైన మార్గమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. క్రీడలు ప్రజలకు ఎన్నో నేర్పుతాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ.. దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా మార్చాలని విజన్‌గా పెట్టుకున్నారని అన్నారు. గురువారం సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఎల్బీ స్టేడియంలో గవర్నర్ క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలు కేవలం మెడల్స్ కోసమే కాదని.. దేశ ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచానికి చూపేందుకు స్పోర్ట్స్ ఒక శక్తిమంతమైన మార్గమని గవర్నర్ వివరించారు. స్వచ్ఛ భారత్ ఒక ఉద్యమంగా మారిందని, యోగాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రధాని మోదీ పాలసీలను ప్రజా ఉద్యమాలుగా మార్చడంలో ఆయన నాయకత్వ సామర్థ్యం అద్భుతమైనదని జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి అన్ని మెడల్స్ వస్తాయని ఊహించలేదని, త్రిపుర నుంచి ఒలింపిక్స్‌కు పోటీ పడుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ కేంద్ర మంత్రి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు ఇంత స్థాయిలో పాల్గొనడం సంతోషకరమని గవర్నర్ అభివర్ణించారు. క్రీడలు ప్రజలకు ఎన్నో నేర్పుతాయన్నారు. ఇది వికసిత్ భారత్ కోసం వేసే ముందడుగు అని.. 'స్వస్థ భారత్, శ్రేష్ఠ భారత్'కు ఇది తొలి అడుగు అని గవర్నర్ ఉద్ఘాటించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, రానున్న రోజుల్లో భారతదేశం క్రీడా రంగంలో ప్రపంచస్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన దేశం జనాభా పరంగా, యువత జనాభా పరంగా ప్రపంచంలో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ, కొన్ని క్రీడల్లో వెనుకబడి ఉందని, అందుకే ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత క్రీడారంగానికి విశేష ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. క్రీడాకారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ, ఓడిపోయిన సందర్భాల్లో కూడా నిరుత్సాహపడవద్దని, ధైర్యంగా ముందుకు సాగాలని సూచిస్తూ, భవిష్యత్తులో గొప్ప విజయాలు సాధించాలని ప్రేరేపిస్తున్నారని గుర్తు చేశారు. ఈ రోజు ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్ వంటి అంతర్జాతీయ క్రీడల్లో భారతీయ క్రీడాకారులు గణనీయంగా రాణిస్తున్నారని, క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, ఫిట్‌నెస్ సదుపాయాల కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక విధాలుగా సౌకర్యాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కామన్‌వెల్త్ గేమ్స్ భారతదేశంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడారంగంలో భారత్ ముందుండాలనే లక్ష్యంతో, అన్ని వర్గాల ప్రజలను క్రీడల్లో భాగస్వాములను చేయడానికి ప్రభుత్వం నిరంతరం ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు..

### నియోజకవర్గ వ్యాప్తంగా డ్వాక్రా మహిళా భవనాలకు

# త్వరలో శంకుస్థాపన

- దాదాపు 7 కోట్ల రూపాయలతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో భవనాల నిర్మాణం
- భవనాలకు త్వరలో శంకుస్థాపన చేసి ఏప్రిల్-మే నెలలోనే అందుబాటులోకి భవనాలు
- మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నదే మా ప్రభుత్వ యొక్క ముఖ్య ఉద్దేశం
- మీడియా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్. మహా:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి మహిళను దృష్టిలో పెట్టుకొని అన్ని రంగాలలో వారికి ఆర్థిక చేయూతనందిస్తూ ప్రోత్సహిస్తుందని అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్రా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఎంతో అభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు.కానీ షాద్ నగర్ నియోజకవర్గం లోని ఆరు మండలాలను కలుపుకొని మహిళా సంఘాలకు సొంత భవనాలు లేని కారణంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని కనీసం మహిళలు సమావేశమై మాట్లాడుకోవడానికి కూడా సమావేశం మందిరాలు పక్క భవనాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలాగే మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మహిళల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు.ముఖ్యంగా స్వయం సహాయక మహిళా సంఘాలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గ వ్యాప్తంగా 70 వరకు మహిళా సంగం పక్కా భవనాలను నిర్మించడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని అన్నారు. త్వరలోనే భవనాలకు శంకుస్థాపన చేసి ఏప్రిల్ లేదా మే నెలలో ఈ భవనాలను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. పార్టీలతో సంబంధం లేకుండా కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఈ భవనాల నిర్మాణానికి సిద్ధంగా ఉండాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 7 కోట్ల రూపాయలతో మహిళా భవనాలను నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. దాదాపు షాద్ నగర్ నియోజకవర్గంలో 157 గ్రామపంచాయతీలో నేను ఎక్కడికి వెళ్లిన మాకు మాట్లాడుకోవడానికి పక్కా భవనాలు లేవనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని వారికి పక్కా భవనాలు నిర్మించి ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఇందులో భాగంగా చౌదరిగుడా మండలం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతం నూతనంగా ఏర్పడడం మండలం కాబట్టి ఆ మండలానికి 22 డ్వాక్రా మహిళా సంఘం భవనాలను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అలాగే ఫరూక్నగర్ మండలానికి 17 డ్వాక్రా భవనాలు, కేశంపేట మండలానికి 11, కొందుర్గు మండలానికి 9 డ్వాక్రా మహిళా భవనాలను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్నయ్య ముదిరాజ్, రఘు నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అగనూరి బసవేశ్వర్, సర్వర్ పాషా,పురుషోత్తం రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీతారాం మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్‌తో

# లోకేష్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

బహూకరించారు. ప్రతిగా సీఎం రేవంత్ రెడ్డి కూడా లోకేశ్ ను సత్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న విద్యా సంస్కరణలు, ఐటీ రంగంలో సాధిస్తున్న ప్రగతిని లోకేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కోసం తీసుకుంటున్న చర్యలు, వాటి ద్వారా వస్తున్న సానుకూల ఫలితాల గురించి చర్చించారు. దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి, తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలిపారు. ముఖ్యంగా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా టాటా సంస్థ సహకారంతో తెలంగాణలోని ఐటీఐలను ఆధునిక స్కిల్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దామని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ క్యాంపస్‌లను సందర్శించి, అక్కడ అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించాలని లోకేశ్ ను ఆయన ఆహ్వానించారు.

**మేడారం దర్శించండి**

కోట్లాది మంది భక్తులు దర్శించుకునే మేడారం సమ్మక్కసారలమ్మ దేవస్థానాన్ని వందల కోట్ల రూపాయలతో ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం చూపని చొరవతో రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, తప్పకుండా వనదేవతలను దర్శించుకోవాలని లోకేష్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. పెట్టుబడుల సాధనలో తెలుగు రాష్ట్రాలు పరస్పరం పోటీపడుతూనే, అభివృద్ధి విషయంలో సహకరించుకోవాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తితో ముందుకెళితే దేశానికే తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## డివిజన్ పరిధిలో మెరుగైన మౌలిక సదుపాయాలు..

### బస్తీ పర్యటనలో కార్పొరేటర్ తోకల



**రాజేంద్రనగర్, మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో జాయింట్ కలెక్షన్ పనులు పూర్తి అయ్యే పనులలో భాగంగా దాదాపు 20 లక్షల రూపాయల విలువగల నూతన భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ పైప్ లైన్ పనులను రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్ బి,అధికారులు పార్టీ నాయకులతో కలిసి పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులలో ఎక్కడ కూడా నాణ్యత లోపాలు లేకుండా పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులలో నాణ్యత కొరవడితే సహించేది లేదన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్ బి, డి జి ఎం, ఖదీర్, లోక్నాథ, పిల్లి శేఖర్ యాదవ్,కుంబ యాదయ్య,జగన్ యాదవ్, మల్లిఖార్జున్, దయానంద్, మధుసూదన్ రెడ్డి, శంకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ఉమామహేశ్వర్ జీ, దయానంద్ జీ,మజర్ బాయ్, జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్తోనే

## రాష్ట్ర అభివృద్ధి: ఎంపీ అనిల్

**ఆమనగల్లు, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం అచ్చంపేటకు వెళ్తున్న క్రమంలో ఆమనగల్లులో కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘనంగా సన్మానం చేశారు.ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యువతకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.అంతకుముందు మైసిగండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నాగోబా ను దర్శించుకున్న ఉప ముఖ్య మంత్రి భట్టి

- మంత్రి లక్ష్మణ్ తో కలిసి ప్రత్యేక పూజలు
- ఆలయాభివృద్ధికి హామీ
- ఆదివాసీలకు అండగా ఉంటామని స్పష్టం



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో వెలసిన మెస్రం వంశీయుల ఆరాధ్య దైవం నాగోబాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. రాష్ట్ర ఎస్సీఎస్టీ సంక్షేమ శాఖా మంత్రి అట్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రికి మెస్రం వంశీయులు, ఆలయ పూజారులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ గర్భాలయంలో నాగోబాకు అభిషేకాలు నిర్వహించి, పూజలు చేశారు. నాగోబా జాతర గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దమని, ఈ పురాతన సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిప్యూటీ సీయం అన్నారు. కేస్లాపూర్ నాగోబా ఆలయ అభివృద్ధికి, జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, గిరిజన బిడ్డల అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా ఆదేశించారు. అలాగే, శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ని, మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులను మెస్రం వంశీయులు శాలువాలతో సన్మానించి, నాగోబ చిత్రపటాలను బహుకరించారు.



### ప్రమాదవశాత్తు

## గడ్డివాము దగ్ధం

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీ విటాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, రైతు ఆలూరు పర్వతాలుకు చెందిన గడ్డి వాము గురువారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. గడ్డివాము విలువ రూ.30 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. పశువుల మేత కోసం తన వ్యవసాయ పొలంలో గడ్డిని భద్రపరుచుకున్నట్లు వారు తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచే

# బాధ్యత ఉపాధ్యాయులదే...

### క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..



**రాజేంద్రనగర్, మహా ;** తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండలం నూతన సంవత్సర క్యాలెండర్, రంగారెడ్డి జిల్లా క్యాలెండర్ లను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు ఉన్న ప్రతి పాఠశాలతో పాటు, అన్ని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చెయ్యాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలలో ఉత్తీర్ణత శాతం పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. తపస్ రాష్ట్ర సంఘటన మంత్రి ( ఆర్గనైజింగ్ సెక్రటరీ) హనుమంతరావు మాట్లాడుతూ తపస్ ఎల్లప్పుడూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం లో ముందు ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ హనుమంత రావు, మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మున్నూరి మహేశ్, శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు వినోద్ కుమార్,మండల ఉపాధ్యక్షురాలు బి, నాగరాణి కాంప్లెక్స్ కన్వీనర్ లు ఎం,పీ,రాజు, విజయ్ కుమార్ సభ్యులు మధుకర్, అరుణ,క్షమామణి ,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



### ప్రభుత్వ భవనాల నిర్మాణానికి

## స్థలం విరాళం

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండలం పెద్దవేములోని భాయితండాలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సర్పంచ్ గోపి నాయక్రూ .60 లక్షల విలువైన 600 గజాల స్థలాన్ని గురువారం దానంగా అందజేశారు. కొంతకాలంగా తండాలో గ్రామ పంచాయతీ భవనం, డ్వాక్రా భవనం, ఇతర భవనాల నిర్మాణానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి సర్పంచ్ ఎన్నికైన ఆయన విరాళంగా అందిస్తున్నట్లు తెలిపారు. స్థలం దానం చేసిన ఆయనను టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన ఉర్దూ అకాడమీ చైర్మన్

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా పరిశీలకులు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ గురువారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. పార్టీ శ్రేణులతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి ఆయనను ఘనంగా స్వాగతించారు.శాలువాలతో సత్కరించారు.మున్సిపల్ ఎన్నికల విషయమై చర్చించారు. ఆదిలాబాద్ బల్దియా పీఠాన్ని హస్తగతం చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అందరూ కష్టపడి పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని కోరారు. ఆయన వెంట ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ ,డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కొండ గంగాధర్, మాజీ కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్ , దర్శనాల లక్ష్మణ్ , నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి,నాగర్కర్ శంకర్, యెల్టి భోజారెడ్డి ,పోతారెడ్డి , ఎంఏ షకీల్ తదితరులున్నారు.



### క్రీడలతో మానసిక ఉల్లాసం: జడ్జి స్వరూప

**ఆమనగల్లు,మహా:** క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం సాధ్యమని జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం చెప్పారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకొని న్యాయవాదులకు ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని సూచించారు. ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకర్ యాదిలాల్ బార్ అసోసియేషన్ కార్యదర్శి దుద్దు ఆంజనేయులు,ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ,కోశాధికారి కొప్పు కృష్ణ,గ్రంథాలయ సెక్రటరీ పస్పుల మల్లేష్, క్రీడా కార్యదర్శి ఏ శేఖర్ ,సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, కృష్ణయ్య, న్యాయవాదులు గణేష్ గౌడ్, సంతోష్, మల్లేష్. మధు గౌడ్,జగన్ గౌడ్, శివ,శ్రీనివాస్, శ్రీశైలం, ఆమనగల్లు జూనియర్ కోర్టు సూపరింటెండెంట్ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

### డిప్యూటీ సీయం ను కలిసిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** రెండు రోజుల ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు.బుధవారం రాత్రి ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ భవనంలో డిప్యూటీ సీయం ను కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయనతో కలిసి భోజనం చేస్తూ ఆదిలాబాద్ నియోజకవర్గ స్థితిగతులు, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సన్నద్ధత గురించి వివరించారు.



# సీపీఎం అభ్యర్థులను గెలిపించండి..

మొయినాబాద్ లో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల వెంటనే ఏర్పాటు చేయాలి

సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్



**మొయినాబాద్ మహా:** సీపీఎం కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని, సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్ పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్ గ్రామంలో సీపీఎం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్ మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో మొయినాబాద్ పురపాలక సంఘంలో పోటీ చేస్తున్న సీపీఎం కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని, మొయినాబాద్ పురపాలక సంఘ ప్రజలకు, కార్మికులకు, కర్షకులకు పిలుపునిచ్చారు. సీపీఎం పార్టీ పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని, అజీజ్ నగర్ లో డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చేంతవరకు నిర్విరామంగా పోరాటం చేసి పేదలకు డబుల్ బెడ్రూం ఇప్పించామని అన్నారు. మొయినాబాద్ పురపాలక సంఘంలో అనేక వార్డులలో రోడ్లు పూర్తిగా ధ్వంసం ప్రస్తుత పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. హైదరాబాద్ కు కుతవేటు దూరంలో ఉన్న మొయినాబాద్ ప్రాంతంలో కనీసం బస్టాండ్ లేదని, పేద విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు లేవని అన్నారు. ఈ ప్రాంత పాలకులు మొయినాబాద్ ప్రాంతా అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని స్థానిక సమస్యలపై పోరాటం చేస్తున్న సీపీఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో సీపీఎం మొయినాబాద్ మండల కార్యదర్శి సీ.హెచ్. ప్రవీణ్ కుమార్, సీపీఎం మొయినాబాద్ మున్సిపల్ నాయకులు దప్పు మహేందర్, ముంజగళ్ళ ప్రభుదాస్, తాళ్లపల్లి శ్రీనివాస్ ఆంగోత్ రాజు, ముంజగళ్ళ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు

## వసంత పంచమి పేరుతో అక్రమ అడ్మిషన్లు

### టి ఎస్ ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్



**రాజేంద్రనగర్, మహా ;** వసంత పంచమి అనే పవిత్రమైన పండుగను ఆసరాగా చేసుకొని విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్లు చేపడుతున్నారు. ఎస్ ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ అడ్మిషన్లపై ఆందోళన వ్యక్తం చేశారు. శంషాబాద్ ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ వసంత పంచమి అనేది విద్య, జ్ఞానానికి ప్రతీక. అలాంటి పండుగను వ్యాపారంగా మార్చి, ముందస్తు అడ్మిషన్లు, డొనేషన్ల వసూలు చేయడం చట్టవిరుద్ధం. విద్య వ్యాపారం కాదు అది బాధ్యత సేవ అని స్పష్టం చేశారు. విద్యాశాఖ నిర్ణయించిన అడ్మిషన్ నిబంధనలు, కాలపరిమితులను ఉల్లంఘిస్తూ తల్లిదండ్రులపై మానసిక ఒత్తిడి తెచ్చే విధానాలు అమలు చేయడం పూర్తిగా తప్పని పేర్కొన్నారు. మీ పిల్లల భవిష్యత్తును నిబంధనలకు విరుద్ధంగా దోపిడీ చేయనివ్వకండి. ప్రభుత్వ నిబంధనలే పిల్లలకు రక్షణ కవచం అన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. అడ్మిషన్లపై వెంటనే చర్యలు తీసుకోవాలిని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం టి ఎస్ ఎస్ ఓ ఎప్పుడూ ముందుంటుంది అని తెలిపారు. కార్యక్రమంలో టి,ఎస్,ఎస్ ఓ సభ్యులు సర్వజిత్, నికేతిన్, విశ్వంత్, శ్రీధర్, గజానంద్, ఉదయ్, నీరజ్ పాల్గొన్నారు.

## 12వ వార్డు నుంచి తమకు అవకాశం కల్పించాలి

### బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త కంబాలపల్లి సురేందర్




**రంగారెడ్డి జిల్లా మహా:** రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో తమకు అవకాశం కల్పించాలని, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డికి, కంబాలపల్లి సురేందర్ అర్జీ పెట్టుకోవడం జరిగింది. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, సామజిక వేత, అంబేద్కర్ వాది, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన కంబాలపల్లి సురేందర్, రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో 12వ వార్డు శేరిగూడ నుంచి ప్రాతినిధ్యం వహించేలా పార్టీ తరపున తమకు అవకాశం కల్పించాలని, బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు అల్వాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డిని కలిసి అర్జీ పెట్టుకోవడం జరిగిందని సురేందర్ వెల్లడించారు. అనంతరం సురేందర్ మాట్లాడుతూ... గత 20 సంవత్సరాలుగా ప్రజా క్షేత్రంలో కొనసాగుతున్నానని, సామాజికవేత్తగా అంబేద్కర్ వాదిగా ప్రజాసేవలో ఉంటూ, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ, ప్రజల శ్రేయస్సు కోరుతూ ప్రజల అభీష్టం మేరకు వచ్చే మున్సిపాలిటీ ఎన్నికలలో 12వ వార్డు శేరిగూడ నుంచి పోటీకి తమకు అవకాశం కల్పించి, ప్రజా సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని రాష్ట్ర నాయకులు ప్రశాంత్ కుమార్ రెడ్డిని కోరడం జరిగిందని ఆయన తెలిపారు. తాళ్ల కుమార్ గౌడ్, మొద్దు వేణుగోపాల్ రెడ్డి, కొంగరి జంగయ్య ఈ సందర్భంగా పాల్గొన్నారు.

## బుడ్డోడా.. నాకు ఆల్‌రెడీ
# పెళ్లయిందిరా..

సెలబ్రిటీకు ప్రపోజల్స్ రావడం అనేది చాలా కామన్. అయితే చిన్నపిల్లలు కూడా ప్రపోజ్ చేస్తున్నారని, అదే కాస్త ఆశ్చర్యంగా ఉందంటోంది హీరోయిన్ అవంతిక మోహన్. టీనేజ్ పిల్లలు పెళ్లి చేసుకోమని అడుగుతున్నారని చెప్తోంది. ఈ మేరకు కొన్ని స్క్రీన్‌షాట్స్ షేర్ చేసింది. అందులో ఓ అబ్బాయి.. కేరళలో చాలామంది నిన్ను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారు. వారిలో నేనూ ఒకడిని అన్నాడు. ఆ మెసేజ్‌కు అవంతిక స్పందిస్తూ.. ఈ పిల్లాడిని చూడండి.. అంత చిన్నవయసులోనే ఎంత ధైర్యమో! చిన్నోడా.. నేను చెప్పేదేంటంటే నాకు ఆల్‌రెడీ పెళ్లయిపోయింది. కాబట్టి నా గురించి ఆలోచించకుండా వెళ్లి నీ హోమ్‌వర్క్ చేసుకో.. నా జీవితంలో కొత్త హీరో ఎంట్రీకి ఛాన్స్ లేదు. నీ కెరీర్ మీద ఫోకస్ చేయు అని చెప్పుకొచ్చింది. మరో స్క్రీన్‌షాట్‌లో ఓ యువకుడు నేను నిన్ను పెళ్లి చేసుకోవచ్చా? అని అడిగాడు. అది చూసిన అవంతికకు కోపం రాలేదు, నవ్వొచ్చింది. నీ మెసేజ్ చూడగానే నాకు నిజంగా నవ్వొచ్చింది. నీకు దాదాపు 20 ఏళ్లు ఉంటాయనుకుంటా.. చాలా రాంగ్ టైమ్ ఇది! అయినా సరే నీ ధైర్యాన్ని మెచ్చుకుని తీరాల్సిందే! సరైన సమయం వచ్చినప్పుడు కరెక్ట్ పర్సన్ నీ జీవితంలోకి వస్తారు.. అప్పటివరకు జీవితాన్ని ఆస్వాదించు అని రిప్లై ఇచ్చింది. అవంతికకు ఇలాంటి ప్రపోజల్స్ గతంలోనూ వచ్చాయి. సినిమాల విషయానికి వస్తే.. అవంతిక యక్షి: ఫేత్‌ఫుల్లీ యువర్స్, నీలాకాశం పచ్చకాదల్ చువన్న భూమి, క్రొకొడైల్ లవ్ స్టోరీ వంటి పలు మలయాళ చిత్రాల్లో నటించింది. తెలుగులో ఉందిలే మంచి కాలం ముందు ముందున సినిమాలో హీరోయిన్‌గా యాక్ట్ చేసింది.






# నావల్ల కాదు!

మలయాళ హీరోయిన్ మాళవిక మోహనన్.. మలయాళంతోపాటు సమానంగా తమిళంలోనూ సినిమాలు చేసింది. కోలీవుడ్‌లో తను నటించిన మాస్టర్, పేట, తంగలాన్ చిత్రాలు తనకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. ఇటీవల ప్రభాస్ ది రాజాసాబ్ సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ప్రస్తుతం కార్తీ హీరోగా నటిస్తున్న సర్దార్ 2 మూవీలో యాక్ట్ చేస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాళవిక చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. ఆమె మాట్లాడుతూ.. చాలాకాలం కిందట సంగతి ఇది. తెలుగు, తమిళంలో కొందరు హీరోయిన్లు డైలాగులను అసలు పట్టించుకునేవారే కాదు. ఒక సన్నివేశంలో బాధగా కనిపించాలంటే ఏడుపు ముఖం పెట్టి ఒకటి, రెండు, మూడు, నాలుగు అని లెక్కపెట్టేవారు. అంతే..! ఆవేశం, కోపం కలగలిపిన సీన్లలో ఏబీసీడీ అనే అక్షరాలను చదువుతూ ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చేవారు. ఏబీసీడీ అన్న అక్షరాలను పదేపదే చదువుతూ ఉంటే పెదాలు కలుస్తూ ఉంటాయి. ఆ లిప్ సింక్ వల్ల డబ్బింగ్‌లో చెప్పే డైలాగ్స్‌కు సరిగ్గా సరిపోయేవి. కెరీర్ మొత్తం వాళ్లిలాగే నెట్టుకొచ్చారు. నేనైతే వారిలా అస్సలు చేయలేను అని చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్‌పై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర భాషా నటుల్ని తీసుకొచ్చి పెడితే ఇలాగే ఉంటుందని కొందరు అంటుంటే.. మాస్టర్ మూవీలో నిన్ను ట్రోల్ చేసిందెందుకో మర్చిపోయావా? అని మరికొందరు మాళవికపై సెటైర్లు వేస్తున్నారు.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com